క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులో 'రేగా' ప్రయాణం


బస్సులో ప్రయాణిస్తున్న కాంతారావు

మణుగూరురూరల్: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మణుగూరు నుంచి కొత్తగూడెం వరకు మంగళవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. సహచర ప్రయాణికులతో మాట్లాడుతూ.. ప్రజా రవాణాలో ఎదురవుతున్న సమస్యలు, ఇతర అంశాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, నాయకులు నూకారపు రమేశ్, వేర్పుల సురేశ్, ముద్దంగుల కృష్ణ, తురక రామకోటి, గుర్రం సృజన్ పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మణుగూరురూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.రవి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ఆయా కళాశాలల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్ కోర్సులు, ఏటీసీ కేంద్రంలో మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్, కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్ (మెకానికల్) అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నామని, అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 28వ తేదీలోపు iti.telangana.govt.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

దమ్మపేట: శిశువులకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ మల్కారం సెక్టార్ సూపర్‌వైజర్ బి.శ్రీదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గుంగులగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసం చేశారు. పోషణ్ అభియాన్ కో–ఆర్డినేటర్ వీరేంద్ర, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ నోట్ పుస్తకాలు, పెన్నులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కల్లూరి వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది చంద్రశేఖర్, యాదగిరి, పాఠశాల ఉపాధ్యాయులు బొద్దు నాగేశ్వరరావు, హైమావతి, గ్రామస్తులు నటరాజ స్వామి, తాతారావు, పిలక వెంకటరమణారెడ్డి, సందీప్‌రెడ్డి, దల్లి వంశీకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల అందజేత

దుమ్ముగూడెం: మండలంలోని కె.దంతెనం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులకు సంబంధించిన బిల్లులను ఎంఈఓ సున్నం సమ్మయ్య మంగళవారం అందజేశారు. గత నెల 30వ తేదీన అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు సంబంధించి చేసిన పనులకు బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ రాము పాఠశాలకు తాళం వేసిన విషయం తెలిసిందే. కాగా పాఠశాల ఖాతాలో ఉన్న రూ.87 వేలను ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్ రాము, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌లకు గ్రామస్తుల సమక్షంలో ఎంఈఓ సమ్మయ్య చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, శాంతకుమార్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

దుమ్ముగూడెం: మండలంలోని తాలిపేరు కాల్వ పూడికతీత పనులను ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ మంగళవారం పరిశీలించారు. తాలిపేరు ప్రాజెక్టు ప్రధాన కాల్వలో మూడు రోజులుగా గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగిపోగా.. తొలగించే పనులు చేపట్టారు. ఈఈ మాట్లాడుతూ.. పూడికతీత పనులు త్వరగా పూర్తి చేయాలని, రైతాంగానికి నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని పేర్కొన్నారు. ఏఈఈ హర్షనాగ్, మస్తాన్‌వలీ ఉన్నారు.

కుటుంబాన్ని ఆదుకోవాలి

గుండాల: మండలంలో వెన్నెలబైలు గ్రామంలో విద్యుదాఘాతంతో పర్సిక రాజు మృతి చెందాడని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కోరం సీతారాములు, మాస్‌లైన్ నాయకుడు కొమరం శాంతయ్య, బీఎస్పీ మండల నాయకుడు రాంబాబు మంగళవారం వేర్వేరు ప్రకటనలో డిమాండ్ చేశారు. చేను పనుల కోసం వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందడం బాధాకరమని, విద్యుత్‌శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

సాగుతూ.. ఆగుతూ..

- మళ్లీ నిలిచిపోయిన సెంట్రల్ పనులు
- అసంపూర్తి పనులతో స్థానికుల ఇక్కట్లు


పనుల్లో భాగంగా పూర్తయిన నాలుగులైన్ల బీటీ రోడ్డు

ములకలపల్లి: మండల కేంద్రంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు మళ్లీ నిలిచిపోయాయి. రూ.5.50 కోట్ల వ్యయంతో 1,200 మీటర్ల మేర ఫోర్‌లైన్ బీటీ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మించాల్సి ఉంది. అసలే నత్తనడకన రెండేళ్లకాలంగా సాగుతున్న పనుల్లో రెండు వారాలుగా ఎటువంటి పురోగతి లేకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచీ నిదానమే..

మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులకు రూ.5.75 కోట్లు మంజూరు కాగా, నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. తర్వాత పనులు మొదలైనా నత్తనడకనే సాగాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలపాటు పనులు నిలిచిపోయాయి. ఆపై రోడ్డు విస్తరణ పేరిట కొన్నాళ్ల పాటు వివాదం నెలకొనగా, ఎట్టకేలకు 45 అడుగుల వద్ద విద్యుత్ స్తంభాలు వేశారు. ఇక పనులు చకచకా సాగుతాయనుకుంటున్న తరుణంలో విస్తరణలో భాగంగా వృక్షాలు, చెట్ల తొలగింపు సమస్యగా మారింది. అటవీశాఖ అనుమతుల పేరిట మరికొన్ని నెలలు పనులు చేయనేలేదు. అనంతరం ఎలాగోలా మొదలుకాగా, మిషన్ భగీరథ పైపులైను మార్చాలంటూ మరికొంత కాలం కాలయాపన జరిగింది. ఎలాగోలా చెట్లు తొలగించి, విస్తరణ చేపట్టి, విద్యుత్ స్తంభాలు వేసి, భగీరథ పైపులైన్ మార్చి ఇలా అనేక అవాంతరాల నడుమ రెండేళ్ల కాలం గడిచిపోయింది. చివరగా పనులు మళ్లీ మొదలుపెట్టి ఫోర్‌లైన్ బీటీ పనులు చేపట్టారు. పాత రోడ్డుకు అనుకుని రెండు వైపులా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇరువైపులా బీటీ (తారు) కూడా వేశారు. ఐతే డివైడర్ కోసం రోడ్డు మధ్యలో కాస్త ఖాళీ వదలడంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో పనులన్నీ పూర్తవుతున్నాయని ఆశపడిన స్థానికులకు ఆశాభంగమే కలిగింది. ఇటీవల అకస్మాత్తులుగా పనులను నిలిపివేశారు. నిర్మాణం ఆపేసి రెండు వారాలు గడుస్తున్నా ఎలాంటి కదలిక లేదు.

నేటికీ డివైడర్ ఊసేలేదు

చాన్నాళ్లుగా సాగుతున్న పనుల్లో నేటికీ రోడ్డు మధ్యలో డివైడర్, దానిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు ఊసే లేకుండా పోయింది. ఇప్పటివరకూ కనీసం ఆదిశగా పనులను ఆరంభించకపోవడం గమనార్హం. విస్తరణ పేరిట ఆర్అండ్‌బీ పరిధిలోని నిర్మాణాలను హుటాహుటిన తొలగించిన అధికారులు.. పనుల విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పనులు సా..గుతున్నా దృష్టి సారించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా నిలిచిన పనులు ఆరంభించి, త్వరితగతిన పూర్తయ్యేలా దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఇబ్బందికరంగా ఉంది



సెంట్రల్ లైటింగ్ పనులంటూ హడావుడి చేశారు. యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల మందర నిర్మాణాలను తొలగించారు. కానీ పనుల్లో మాత్రం వేగం కనిపించడం లేదు. అసంపూర్తి పనులతో ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలి.

–బిక్కుమళ్ల సుధాకర్, వ్యాపారి, ములకలపల్లి

నాలుగు రోజుల్లోపే..



కార్మికులు, మిషన్ల కొరత వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. నాలుగు రోజుల్లో నిలిచిన పనులను మొదలు పెడతాం.. కార్మికులు, యంత్రాలను సమకూర్చి, త్వరతగతిన డివైడర్, సెంట్రల్ లైటింగ్ తదితర పనులన్నీ పూర్తి చేసి, అందుబాటులోకి తీసకొస్తాం.

–విశ్వనాథ్, డీఈ, ఆర్అండ్‌బీ

సెలవుదినంగా ప్రకటించండి..

దుమ్ముగూడెం: మండలంలోని ప్రతి ఆదివాసీ గ్రామంలో ఆగస్టు 9న ఆకుపచ్చ జెండా ఎగరాలని ఏఎస్పీ జిల్లా జాయింట్ సెక్రటరీ సొందె మల్లూరు పిలుపునిచ్చారు. మంగళవారం లక్ష్మీనగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతి ఆదివాసీ పండగలా జరుపుకుని విజయవంతం చేయాలన్నారు. ఆరోజున ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భద్రాచలం డివిజన్ నాయకులు కారం గోపాల్, కోరం మురళి, రాజు, మండల నాయకులు సోడి సుశాంత్, కారు వినీత్, సురేశ్, ప్రసాద్, వీరు, రాంబాయమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం: ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకుడు సిద్దబోయిన శ్రీకాంత్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. మండలంలోని భట్టుపల్లి వీరాపురం క్రాస్ రోడ్‌లోని కొమరం భీం సెంటర్‌లో ఈ వేడుకలను అన్ని ఆదివాసీ సంఘాలతో కలిసి ఘనంగా నిర్వహించేందుకు యువత సిద్ధం కావాలని, ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతి ఇంట్లో పండగలా జరుపుకోవాలని, సంస్కృతి, సంప్రదాయాలు, అస్తిత్వం, హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు


మొక్క అందజేస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం సబ్ కలెక్టర్‌గా బాధ్యలు చేపట్టిన మృణాల్ శ్రేష్టను టీఎన్జీవోస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వీరబాబు, గగ్గూరి బాలకృష్ణ, పసుపర్తి అపర్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రవిశర్మ, పడిగ నరసింహారావు, సాధిక్‌పాషా, అంజిబాబు, మోహన్‌రావు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దమ్మపేట: మృతురాలి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన కోలికపోగు తిరుపతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మోరంపూడి వెంకటేశ్వరరావు.. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందజేశారు.

పూడికతీత పనులపై ఫిర్యాదు


చిత్రాలను చూపుతున్న సభ్యులు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వాగుల్లో పూడికతీత పనులు తూతూమంత్రంగా చేయడంతో సాధారణ వర్షపాతానికే మణుగూరులో వాగులు ఉప్పొంగాయని ఆ పనులపై విజిలెన్స్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సింగరేణి సీఎస్ఆర్ నిధులు రూ.కోట్లు వెచ్చించి చేసిన కట్టువాగు, మొట్టువాగు, కోడిపుంజుల వాగుల్లో పూడికతీత పనులు ఎక్కడా కనిపించడం లేదన్నారు. కాల్వల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. పూడికతీత పేరు చెప్పి తక్కువ పనులకు ఎక్కువ అంచనాలు వేయించి డబ్బులు జేబుల్లో వేసుకుని అభివృద్ధి నిధులను పక్కదారి పట్టించారన్నారు. పనులపై విచారణ జరిపి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విజిలెన్స్ అధికారుల దృష్టికి, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అనంతరం పూడికతీత పనులు అసంపూర్తిగా పూర్తి చేసిన చిత్రాలను చూపారు. సమావేశంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు షబానా, సౌజన్య, రేణుక, శ్యామల, సుజాత, శైలజ, పార్వతి, వసంత తదితరులు ఉన్నారు.

వ్యర్థ పదార్థాలు వేస్తే జరిమానా

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దొంతికుంట చెరువు పరిసరాల్లో వ్యర్థ పదార్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ బి.నాగరాజు హెచ్చరించారు. మంగళవారం చెరువు వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, మాట్లాడారు. సాగునీటి చెరువు వద్ద చెత్తచెదారం వేసినా, బహిరంగ మలవిసర్జన చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పురపాలక సంఘం ఆదేశాలను బేఖాతరు చేస్తే రూ.5 వేలు జరిమానా విధిస్తామని, అలాగే దీనిపై ఫొటో తీసి సమాచారాన్ని అందించిన వారికి రూ.1,000 బహుమతిగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కామేశ్, నాగేంద్ర, రమణ పాల్గొన్నారు.


బోర్డు ఏర్పాటు చేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

నిర్లక్ష్య ధోరణి సరికాదు

మణుగూరుటౌన్: సింగరేణిలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల విషయంలో ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని ఏబీకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మాధవ్‌నాయక్, కార్పొరేట్ సెక్రటరీ ఊట్ల గణేశ్ అన్నారు. మంగళవారం పీకేఓసీ–2లో గేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎంపీఎఫ్, ఈపీఎఫ్ సమస్యలు నెలలు గడుస్తున్నా పరిష్కారం కావడం లేదని తెలిపారు. 136 సంస్థల ఆధారంగా పనిచేస్తున్న కార్మికులకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. వారసత్వ నియామకాలపై అవసరమైతే పోరాట బాటపడతామని పేర్కొన్నారు. సమావేశంలో ఏరియా నాయకులు భుక్యా కిషన్, సత్యనారాయణ, రంజిత్, మహేశ్, అజ్మీర వెంకటేశ్వర్లు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ..

అశ్వాపురం: మండలంలోని జగ్గారంలోని ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమంలో లయన్స్‌క్లబ్ మణుగూరు అధ్యక్షుడు మీరాహుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం చార్టెడ్ ప్రెసిడెంట్ పిల్లారిశెట్టి హరిబాబు – భానుమతి దంపతుల మనవరాలు జీవితశ్రీ పుట్టినరోజు సందర్భంగా వంట గిన్నెలు, క్వింటా బియ్యం వితరణగా అందజేశారు. వృద్ధులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు షహనాజ్‌బేగం, లయన్స్‌క్లబ్ సభ్యులు బేతంశెట్టి నాగేశ్వరరావు, చింతపల్లి రాంబాబు, డాక్టర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రేషన్‌కార్డుల పంపిణీ


దుమ్ముగూడెం: రేషన్‌కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే


అశ్వారావుపేటరూరల్: మంజూరు పత్రం అందిస్తున్న అధికారులు


దమ్మపేట: రేషన్ కార్డు అందిస్తున్న నాయకులు

దుమ్ముగూడెం/భద్రాచలంటౌన్: మండలంలో ప్రజలకు మంజూరైన రేషన్‌కార్డులను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రేషన్ డీలర్లు ఎమ్మెల్యే సన్మానించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ వివేక్‌రామ్, పౌరసరఫరాలశాఖ డీటీ రాజులు, తెల్లం సీతమ్మ, కల్లూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు, జయరాజు, కొమరం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, భద్రాచలం తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: ఆహార భద్రత కార్డుల మంజూరు పత్రాలను స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ, మున్సిపాలిటీ కమిషనర్ బి.నాగరాజు మంగళవారం లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమాల్లో ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, రేషన్ డీలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట: మండలంలో మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, కాంగ్రెస్ నాయకులు అర్జున్, చిన్నినాయన, బొల్లికొండ నాగేశ్వరరావు, వాసం వేణు తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు


పనులను పర్యవేక్షిస్తున్న వర్క్‌ఇన్‌స్పెక్టర్ కృష్ణ

సాక్షి ఎఫెక్ట్..

కరకగూడెం: మండలంలోని పలు రహదారులు వర్షాలకు దెబ్బతినడంతో పాటు బూడిదవాగు బ్రిడ్జి కూడా దెబ్బ తిన్నదని మంగళవారం 'సాక్షి'లో 'ఇవేం రోడ్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సమత్ భట్టుపల్లిలోని కోతకుగురైన బూడిదవాగు బ్రిడ్జి ఒక వైపు రహదారికి మరమ్మతులు చేపట్టారు. వాగులోంచి ఇసుక బస్తాలను పేర్చుకుంటూ పనులు కొనసాగించారు. ఆర్అండ్‌బీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ కృష్ణ పర్యవేక్షించారు.

జీపీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏజే రమేశ్

ములకలపల్లి: ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సంఘం మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. జీపీ వర్కర్లకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రక్షణ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండలంలోని పూసుగూడెంలో త్వరలో జీపీ కార్మికుల జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్ నిమ్మల మధు, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చిక్కుల శ్రీను, గంటా శ్రీనివాసరావు, వర్కా రుక్మాంగధరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు అవార్డుల ప్రదానం


అవార్డులతో ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్

గుండాల: కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ప్రవేశపెట్టిన ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా అమలవున్న సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో విశిష్ట సేవలందించిన వైద్యాధికారితో పాటు పలువురు జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. ప్రభుత్వ వైద్యాధికారి మనీశ్‌రెడ్డి, నలుగురు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పురస్కారాలు అందుకున్నారు.

పొరదోలకుంటే ప్రమాదమే..

- దోమకాటుతో అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు
- ప్రాణాలకు ముప్పుగా మారుతున్న వ్యాధులు
- నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్


కుదునూరులో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు

చర్ల: మురుగునీరు, మంచినీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధిచెందుతాయనే విషయం తెలిసిందే. మురుగునీటిలో ఉండే దోమలు మలేరియాతో పాటు పలు వ్యాధులు, మంచినీటిలో పెరిగే దోమలు డెంగీతోపాటు మరికొన్ని రోగాలను వ్యాప్తిచేస్తాయి. దోమల్లో ఆడ అనాఫిలిస్, క్యూలెక్స్, ఏడిస్, ఆర్మీజరీస్ మాన్ సోనియా లాంటి జాతులు ఉన్నాయి. ఇవి ఎక్కువగా మానవుల రక్తాన్ని పీల్చి ఆహారంగా తీసుకుంటాయి. దోమ కుట్టడం వల్లే ప్రజలు అనారోగ్యం బారిన పడి వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. దోమల కారణంగా వచ్చే వ్యాధుల్లో కొన్ని..

డెంగీ, మలేరియా, చికున్ గున్యా..

డెంగీ బారిన పడిన వారికి ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన జ్వరం వస్తుంది. కళ్లు నొప్పిగా ఉండడం, ఒళ్లంతా దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి సకాలంలో చికిత్స పొందకపోతే ప్రాణాంతకంగా మారుతుంది. మలేరియా వచ్చిన వారిలో తీవ్రమైన చలితో కూడిన జ్వరం వస్తుంది. ఈ జ్వరాన్ని సరైన సమయంలో గుర్తిస్తే నయమవుతుంది. ఈ వ్యాధి దోమల వల్లనే వ్యాప్తి చెందుతుంది. ఇక చికున్ గున్యా వ్యాధి వచ్చిన వారిలో కాళ్లు, చేతులు, కీళ్ల నొప్పులు విపరీతంగా ఉంటాయి. నొప్పి తీవ్రత వల్ల నడవలేని పరిస్థితి కూడా ఉంటుంది. జ్వరంతో పాటు ఈ తరహా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.


బోదకాలు

ఈ వ్యాధి బారిన పడిన వారు తొలిదశలోనే గమనించి వైద్యం చేయించుకుంటే నయం అవుతుంది. లేదంటే జీవితాంతం బాధపడాల్సి వస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన వారికి కాళ్లు లేదా చేతులు లేదంటే రెండూ కూడా విపరీతంగా వాచిపోతాయి. తరుచూ జ్వరం వస్తుంది. చంకల్లో గజ్జల్లో బిల్లలు ఏర్పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. క్యూలెక్స్ అనే ఆడ దోమ కుట్టడం ద్వారా ఇది వ్యాప్తి చెందుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నీటి కుంటలు, మురుగు కాల్వల్లో కిరోసిన్, కాలిన ఆయిల్ వంటివి చల్లాలి. మళ్లించడానికి అనుకూలంగా లేని మురుగునీటి గుంటల్లోని నీళ్లలో ఆయిల్ బాల్స్ వేయాలి.
- గ్రామాల్లో మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి.
- నీటి నిల్వ పాత్రలు, ఎయిర్ కూలర్లు, నీళ్ల డమ్ముల్లో నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- ఇళ్లల్లో దోమలు బయటకు వెళ్లేందుకు పొగ పెట్టాలి. పిల్లలకు హాని కలిగించే రసాయనాలతో కూడిన పొగ పెట్టగూడదు.
- శరీరాన్ని కప్పి ఉంచే విధంగా దుస్తులు దరించాలి. దోమతెరలను వాడాలి.
- ఇళ్లల్లో కిటికీల నుంచి దోమలు రాకుండా జాలీలు ఏర్పాటు చేయాలి. తలుపులు పూర్తిగా వేసి ఉంచాలి లేదంటే జాలీతో తయారు చేసిన తలుపులు ఏర్పాటు చేసుకోవాలి.


దోమలు పెరిగాయి..



గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో దోమలు బాగా వృద్ధి చెందుతున్నాయి. రాత్రి వేళల్లో దోమలు కుట్టడం వల్ల జ్వరాల బారిన పడుతున్నాం. సాయంత్రం అయితే చాలు దోమలు ఇళ్లల్లోకి చేరుతున్నాయి. ఎక్కడి మురుగు నీరు అక్కడే నిల్వ ఉంటోంది. దోమల మందు పిచికారీ చేసి రాత్రి వేళల్లో ఫాగింగ్ చేయాలి. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

–కూరపాటి వీర్రాజు, ఆర్.కొత్తగూడెం

దోమ కాటుతోనే వ్యాధులు



దోమ కాటు వల్లనే వ్యాధులు ఎక్కువగా వస్తాయి. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియాసిస్ వంటి వ్యాధులు దోమల వల్లనే సంభవిస్తాయి. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాల్లో గుంతలు పూడ్చుకోవాలి. జ్వరం రాగానే వెంటనే వైద్యశాలకు వస్తే గుర్తించి చికిత్స అందిస్తాం. వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి.

–డాక్టర్ సాయివర్ధన్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, చర్ల